

ఎదులాపురం : ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో నిల్చున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్



ఎదులాపురం : సెల్ఫీపాయింట్ వద్ద ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి


నిర్మల్ టౌన్ : పోలింగ్ కేంద్రం పరిశీలనకు వస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

# ఓటేసిన ప్రముఖులు

- ఆయా చోట్ల ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్న బీఆర్ఎస్ అభ్యర్థులు
- ఆదర్శ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు..

ఎదులాపురం, నవంబర్ 30 : ఆదిలాబాద్ జిల్లాలో ఉన్నతాధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరూరా జ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఉపయోగించుకోవాలని అవగాహన కార్యక్రమాలు చేపట్టిన అధికారులు, వారు ఓటు వేసి ఆచరణలో చూపించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ డీ ఉదయ్‌కుమార్ రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. డైట్ కళాశాలలోని 261 పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ రాహుల్ రాజ్, శ్రీజ దంపతులు సామాన్య ఓటర్లుతో కలిసి క్యూలో నిలబడి తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. అనంతరం సెల్ఫీపాయింట్ వద్ద ఫొటోలు దిగారు. అలాగే శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో ఉన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా చర్యలను పర్యవేక్షించి, సిబ్బందికి సూచనలు చేశారు.

**అకట్టుకున్న ఆదర్శ పోలింగ్ కేంద్రాలు..**

వంద శాతం పోలింగ్ నమోదే లక్ష్యంగా ఎన్నికల సంఘం పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. విస్తృత అవగాహన కల్పించడంతో పాటు పలు కేంద్రాలను ఆదర్శ కేంద్రాలుగా ఎంపిక చేసింది. ఆదిలాబాద్, బోథ్ రెండు నియోజకవర్గాల్లో 20కిపైగా ఆదర్శ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఓటు వేసి సెల్ఫీలు దిగేందుకు వీలుగా సెల్ఫీపాయింట్లను సైతం ఏర్పాటు చేశారు. తల్లితండ్రులతో పాటు వచ్చిన చిన్నారులు ఆడుకునేందుకు వీలుగా ఆట వస్తువులను అందుబాటులో ఉంచారు. అలాగే ఆయా పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, దివ్యాంగుల కోసం సైతం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. కేంద్రాలకు వచ్చిన వృద్ధులకు పోలీసులతో పాటు వలంటీర్లు సహకారం అందించారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్‌ఛైర్స్ అందుబాటులో ఉంచారు.

**ఎల్లపెల్లిలో మంత్రి అల్లోల..**

సోన్, నవంబర్ 30 : నిర్మల్ మండలం ఎల్లపెల్లి ప్రాథమిక పాఠశాలలో నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుకుకు ఉన్న ప్రాధాన్యత తెలుసుకొని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట సర్పంచ్ అల్లోల రవీందర్‌రెడ్డి, నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, అల్లోల గౌతంరెడ్డి, అల్లోల సురేందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి తదితరులున్నారు.

**నేరడిగొండలో జాదవ్ అనిల్..**

నేరడిగొండ, నవంబర్ 30 : బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని రాజురాలో ఉదయం మొట్టమొదటి ఓటు జాదవ్ అనిల్ వేశారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని నియోజకవర్గ ప్రజలను కోరారు.

**దేగాంలో విఠల్ రెడ్డి..**

భైంసాటౌన్, నవంబర్ 30 : ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే విఠల్ రెడ్డి తన స్వగ్రామమైన దేగాం ప్రభుత్వం పాఠశాల 167 బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఓటు హక్కు కలిగిన ప్రజలందరూ తమ విలువైన ఓటును సకాలంలో వెళ్లి, వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ఖానాపూర్‌లో జాన్సన్ నాయక్..**

ఖానాపూర్ టౌన్, నవంబర్ 30 : ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ పట్టణంలోని శాంతినగర్ ఒడ్డెవాడ పాఠశాలలోని 237 పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అంతకుముందు స్థానిక హనుమాన్ ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఏపీపీఎస్సీ మాజీ సభ్యులు పైడిపెల్లి రవీందర్‌రావు దంపతులు, మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.


ఖానాపూర్ టౌన్ : ఓటు వేసిన అనంతరం సెల్ఫీ తీసుకుంటున్న మహిళా ఓటర్లు


ఎదులాపురం : ఆదర్శ పోలింగ్ కేంద్రంలో చిన్నారుల కోసం ఆటవస్తువులు



ఎదులాపురం : ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో నిల్చున్న కలెక్టర్ సతీమణి శ్రీజ

# విదేశాల నుంచి వచ్చి..


ఎదులాపురం : అమెరికా నుంచి వచ్చిన రంగు శ్యామ్‌రాజ్ గౌడ్-మనోరమ దంపతులు

ఎదులాపురం, నవంబర్ 30 : ప్రవాస భారతీయ దంపతులు అమెరికా నుంచి రాష్ట్రానికి వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని దోబికాలనీకి చెందిన రంగు శ్యామ్‌రాజ్ గౌడ్, మనోరమ దంపతులు విద్యాశాఖలో పనిచేస్తూ విరమణ పొందారు. వారు గురువారం జిల్లా కేంద్రంలోని దోబికాలనీ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో మంచి పాలన కోసం అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సందేశం ఇచ్చారు. అలాగే వివిధ పనులు, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డవారు రైళ్లు, బస్సులు, ప్రత్యేక వాహనాల ద్వారా ఆదిలాబాద్ జిల్లాకు వచ్చారు. జిల్లా కేంద్రానికి చెందిన జీ విశ్వనాథ్ గాదేవార్, భార్య శారద తమ పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. జిల్లాకు వచ్చి, ఓటు హక్కు వినియోగించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే పట్టణంలోని టీచర్ కాలనీకి చెందిన అనూష ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. భర్త వినిల్ ఆసిఫాబాద్ జిల్లాలో రవాణా శాఖలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. దీంతో తన ఓటు హక్కును వినియోగించుకోవడానికి కుమారుడితో కలిసి జిల్లాకు వచ్చారు.


ఆదిలాబాద్ రూరల్ : కువైట్ నుంచి వచ్చిన సయ్యద్ మహెబూబ్ అలీ

**కువైట్ నుంచి..**

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 30 : పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సయ్యద్ మహెబూబ్ అలీ తన ఓటు హక్కు వినియోగించుకునేందుకు కువైట్ నుంచి సొంత ఖర్చులతో వచ్చారు. డిసెంబర్ 2వ తేదీన రిటర్న్ ఫ్లైట్ ఉన్నది. 15 ఏండ్లుగా ఆయన కువైట్‌లోనే పని చేస్తున్నారు. ఎన్నికల సమయంలో వచ్చి తన ఓటు వినియోగించుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉదయం 7.30 గంటలకు హైదరాబాద్ చేరుకొని అక్కడి నుంచి కారులో ఆదిలాబాద్‌కు వచ్చి తన ఓటు వేశారు. ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని ఆయన కోరుతున్నారు.

# అమ్మవారిని దర్శించుకున్న విఠల్ రెడ్డి


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డిగారి విఠల్ రెడ్డి

బాసర, నవంబర్ 30 : బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారిని గురువారం ముథోల్ నియోజక వర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి దర్శించుకున్నారు. పోలింగ్ నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజల ఆశీర్వాదంతో మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.